# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 01 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## కేజ్రీవాల్, సిసోడియా, కవితల కస్టడీ పొడిగింపు



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జుడిషియల్ కస్టడీని ఆగస్టు 13 వరకు ఢిల్లీ కోర్టు పొడిగించింది. బీఆర్ఎస్ ఎంఎల్సి కె కవిత కస్టడీని కూడా ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఆగస్టు 13 వరకు పొడిగిస్తూ బుధవారం ఆదేశాలు జారీచేశారు. ఇదే కుంభకోణానికి సంబంధించి సిబిఐ నమోదు చేసిన అవినీతి కేసులో సిసోడియా, కవితల జుడిషియల్ కస్టడీని ఆగస్టు 9 వరకు కోర్టు పొడిగించింది. ఇదివరకు విధించిన జుడిషియల్ కస్టడీ గడువు ముగియడంతో నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరిచారు.

## సీఎం మాటలతో
# అసెంబ్లీలో మంటలు

- వెనుక ఉన్న మహిళలను నమ్మవద్దంటూ రేవంత్ వ్యాఖ్యాలు
- వ్యాఖ్యాలను వెనక్కి తీసుకుని, వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు డిమాండ్
- స్పీకర్ పోడియం వద్ద బైఠాయించి నిరసన

### గందరగోళం మధ్య ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ద్రవ్య వినిమయ బిల్లుకు అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది.. కాగా రేవంత్ చేసిన వ్యాఖ్యాలపై సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో సభలో గందరగోళం ఏర్పడింది.. ఈ బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన, నిరసనల మధ్యే ద్రవ్య వినిమయ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ సభను రేపటికి వాయిదా వేశారు.

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం మాటలు అసెంబ్లీలో మంటలు రేపాయి.అధికార ప్రతిపక్ష నేతలు పార్టీ ఫిరాయింపులపై పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని లక్ష్యంగా చేసుకుని అధికార పక్షం వ్యాఖ్యలు చేయడంతో బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు.

చర్చలో భాగంగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డికి మధ్య మాటల యుద్ధం నడుస్తున్న క్రమంలో.. రేవంత్ రెడ్డి పరోక్షంగా సబితా ఇంద్రారెడ్డిపై విమర్శలు చేశారు. కేటీఆర్ మీ వెనుక ఉన్న అక్కల మాటలు వింటే.. జూబ్లీ బస్టాండ్‌లో కూర్చోవల్సి వస్తుందంటూ ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు సభలో ఒక్కసారిగా దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యాలను వెనక్కి తీసుకుని, వెంటనే క్షమాపణ చెప్పాలని కోరుతూ బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం వద్ద బైఠాయించారు.. . సభలో మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలని బిఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యేలు సైతం నిరసనకు దిగారు.. పోడియం ఎదుట సబిత, సునీత, కోవాలక్ష్మి బైఠాయించారు.. అలాగే ఇతర బిఆర్ఎస్ సభ్యులు పోడియంను చుట్టుముట్టారు.. సీఎం రేవంత్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, ఎమ్మెల్యే సబితకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.. ఇదే సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ మాట్లాడుతూ, సబిత మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలని కోరారు.. అయితే స్పీకర్ నుంచి ఎటువంటి ప్రతిస్పందన లేకపోవడంతో ముగ్గురు మహిళా ఎమ్మెల్యేలు పోడియం వద్ద బైఠాయించారు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారం నశించాలి అని డిమాండ్ చేస్తున్నారు. సబితకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభకు మార్షల్స్ ను పిలిపించారు స్పీకర్ ..

పార్టీ ఫిరాయింపులపై మాట్లాడుతూ మంత్రి సీతక్క ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన సబితా ఇంద్రారెడ్డితో పార్టీ ఫిరాయింపులపై గవర్నర్‌కు ఫిర్యాదు ఇప్పించారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు రాజీనామా చేయించి ఎమ్మెల్యేలను చేర్చుకున్నారా అని ప్రశ్నించారు.

మంత్రి సీతక్క వ్యాఖ్యలపై సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. తనను ఎందుకు టార్గెట్ చేశారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినప్పుడు తాను సంతోషంగా ఆహ్వానించానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఆశాకిరణం అవుతావని చెప్పానని, సీఎం అవుతావని కూడా చెప్పానని సబిత గుర్తు చేశారు. రేవంత్ సీఎం అవుతావని చెప్పి మరీ గతంలో కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించానని పేర్కొన్నారు. అయినా తనపై ఆయన ఎందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడంలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి బదులిచ్చారు. ఆమె తనను పార్టీలోకి ఆహ్వానించిన మాట వాస్తవమేనని ఈ సందర్భంగా ఇద్దరి మధ్య జరిగిన వ్యక్తిగత సంభాషణలను సభలో ప్రస్తావించారు. 2019లో తనను మల్కాజిగిరిలో పోటీచేయాలని కాంగ్రెస్ పార్టీ కోరిందని ఆ సమయంలో తనకు అండగా ఉంటానని సబిత మాట ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ తనను అభ్యర్థిగా

మిగితా 3వ పేజీలో

## తెలంగాణ నూతన గవర్నర్ ప్రమాణ స్వీకారం



- హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గం, కాంగ్రెస్,

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నాలుగో గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు రాజ్ భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే కొత్త గవర్నర్‌తో ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గం, కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు మధ్యాహ్నం అగర్తలా నుంచి బయలుదేరిన గవర్నర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయంలో మంత్రులు ఉన్నతాధికారులతో కలిసి ఘనస్వాగతం పలికారు.

తెలంగాణ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ప్రజానీకానికి తన సందేశాన్ని అందించారు. తనకు రాష్ట్ర గవర్నర్‌గా అవకాశం కల్పించిన భారత రాష్ట్రపతికి, ప్రధానికి ధన్యవాదాలు తెలియజేశారు. త్రిపుర నుంచి వచ్చిన తాను, గొప్ప సంస్కృతి, సుసంపన్నమైన వారసత్వ సంపద, సారవంతమైన నేలలతో దేశ నడిబొడ్డున ఉన్న తెలంగాణకు సేవ చేయడం గర్వంగా ఉందన్నారు. తెలంగాణ చైతన్యవంతమైన ప్రాంతమన్నారు. వ్యాపారాలకు సైతం కేంద్రబిందువుగా మారిందన్నారు. రాష్ట్రంలో యువకుడు ముఖ్యమంత్రిగా ఉన్నారని, మంచి మంత్రివర్గం ఉందని, వారితో కలిసి రాష్ట్ర అభ్యున్నతికి పాటు పడుతానని తెలిపారు. సుస్థిర ఆర్థికాభివృద్ధితో పాటు సామాజిక అంశాల్లో తెలంగాణను అగ్రగామిగా ఉంచేందుకు అందరితో కలిసి పనిచేస్తానన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులను రుణ విముక్తులను చేసింది : యువతకు మంచి విద్య, ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషి చేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను రుణ విముక్తులను చేసిందన్నారు. సామాజిక న్యాయం చివరి వ్యక్తికి సైతం అందాలన్న గవర్నర్, ఐక్యతతో ఉంటూ సుస్థిరాభివృద్ధి సాధించే దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ సమాజానికి తన పిలుపునిచ్చారు. గవర్నర్‌గా రాజ్యాంగ విలువలకు కట్టుబడి, పారదర్శకంగా తన విధులు నిర్వహిస్తానని ఆయన వెల్లడించారు.

1957 ఆగస్టు 15న జన్మించిన జిష్ణుదేవ్ వర్మ, త్రిపుర రెండో డిప్యూటీ సీఎంగా 2018 నుంచి 2023 వరకు పని చేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగానూ గతంలో సేవలందించారు. ఆయన త్రిపుర రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి. 1990లో భారతీయ జనతా పార్టీలో చేరి ముఖ్యపాత్ర వహించారు. రామజన్మభూమి ఉద్యమంలోనూ ఆయన క్రియాశీల పాత్ర పోషించారు. తెలంగాణ బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులుకాగా, ఆ రాష్ట్రానికి చెందిన నాయకుడు తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా రావడం విశేషం.



"కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చూపిస్తూ.. అక్కడ ఉన్న వారు ఏ పార్టీ నుంచి ఏ పార్టీలో చేరారో చర్చిద్దాం. నన్ను ఎందుకు టార్గెట్ చేశారు? నేను ఏం మోసం చేశాను? ఎవరిని ముంచాను? రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి రమ్మని ఆహ్వానించింది నేనే. లా అండ్ ఆర్డర్ సరిగ్గా లేదని మాట్లాడితే, నన్ను టార్గెట్ చేశారు" అంటూ సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతుంటే.. స్పీకర్ జోక్యం చేసుకొని సభా నాయకుడిని అగౌరవ పరుస్తు న్నారని అన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్‌లో సబిత ఏయే పదవుల్లో కొనసాగారో ప్రస్తావించారు. దాంతో సబిత.. సభలో ఏడ్చేశారు.



"2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ సబితా ఇంద్రారెడ్డికి అనేక పదవులు ఇచ్చింది. కానీ.. ఆమె పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరి మోసం చేశారు. ఒక దశాబ్ద కాలం సబితకి మంత్రి పదవి ఇచ్చాం. కాంగ్రెస్ అధికారంలోకి రాకపోయేసరికి, సబిత బీఆర్ఎస్‌లోకి వెళ్ళారు. కాంగ్రెస్ నన్ను సీఎల్పీ లీడర్ చేస్తే, నా వెనక ఉండాల్సింది పోయి, పదవి కోసం సబిత పార్టీ మారారు. ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసేందుకు సబిత పార్టీ వదిలి వెళ్లారు. పార్టీలు మారి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది చాలక, ఇప్పుడు ఏదో మాట్లాడుతున్నారు. అసలు సబిత ఎందుకు బాధపడుతున్నారో అర్థం కావడం లేదు" అని భట్టి విక్రమార్క అన్నారు.



సబితా ఇంద్రారెడ్డిని సబితక్కా అని పిలుస్తూ "ప్రజా జీవితంలో ఉన్నప్పుడు చర్చ ఉంటుంది. వ్యక్తిగతంగా జరిగిన చర్చను సబితక్క సభలో పెట్టారు. నువ్వు కాంగ్రెస్‌లోకి వస్తే ముఖ్యమంత్రివి అవుతావని సబితక్క నాకు చెప్పారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నుంచి పోటీ చేయమని నాకు సబితక్క చెప్పి ఆమె మాత్రం బీఆర్ఎస్ లోకి వెళ్ళారు. నన్ను మోసం చేసిన సబితక్కతో జాగ్రత్తగా ఉండాలని నేను చెప్పాను. నేను చెప్పే మాట నిజమా? కాదా? అని సబితక్క గుండెపై చేయి వేసుకొని చెప్పాలి" అన్న సీఎం రేవంత్ ఆ తర్వాత కొత్త గవర్నర్‌ని రిసీవ్ చేసుకోవడానికి వెళ్లారు. అయితే.. సబిత చర్చ జరగడానికి కారణం కేటీఆరే అంటూ స్పీకర్.. కేటీఆర్‌పై సీరియస్ అయ్యారు.

## రేవంత్ సీఎం పదవికి అన్‌ఫిట్

- ఆడబిడ్డలపై సీఎం నోరు పారేసుకున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నేడు సీఎం దిష్టిబొమ్మ దహనాలకు పిలుపు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నోరు జారితే ఎవరైనా తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటారని.. కానీ కండకావరంతో ఆడబిడ్డలను అవమానించారంటూ సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ మహిళా శాసనసభ్యులపై అకారణంగా సీఎం నోరుపారేసుకున్నారన్నారు. అక్కలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందని ముఖ్యమంత్రి నికృష్టంగా మాట్లాడారని ధ్వజమెత్తారు. ఈ అవమానం కేవలం సబితక్కకు, సునీతక్కకు జరిగింది కాదని.. తెలంగాణ ఆడబిడ్డలు అందరి పట్ల జరిగిన అవమానమన్నారు.

మహిళలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడడం శోచనీయమన్నారు. రేవంత్ సీఎం పదవికి అన్‌ఫిట్ అన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఉసురు తగులుతుందని.. ఇద్దరూ మహిళా నేతలు కష్టపడి ప్రజల మధ్యలో తిరిగి నేతలైన గొప్ప ఆడబిడ్డలు అన్నారు. ప్రజల దీవెనలు కార్యకర్తల ఆశీర్వాదంతో గెలిచి వచ్చినవారని.. నీ లెక్క పార్టీలు మారి పదవులు తెచ్చుకున్న వాళ్ళు కారని.. ఈ విషయాన్ని సీఎం రేవంత్ గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సిగ్గు తెచ్చుకొని.. బుద్ధి తెచ్చుకొని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ మొహం పెట్టుకుని వచ్చినవని ఉపముఖ్యమంత్రి అనడం అన్యాయమన్నారు.

ఆడబిడ్డల గురించి అంత ధైర్యంగా మాట్లాడే అధికారం నీకు ఎవరు ఇచ్చిర్రు భట్టి గారు అంటూ ధ్వజమెత్తారు. పదేళ్ల అధికారంలో ఉన్న ఏరోజైనా ఒక్కరోజైనా ఆడబిడ్డలను అవమానించామా? అంటూ నిలదీశారు. ముఖ్యమంత్రి ఏకవచనంతో మాట్లాడామని అని అభ్యంతరం చెప్తే వెంటనే మార్చుకున్నామని.. అది తమకు కేసీఆర్ నేర్పించిన సంస్కారమని తెలిపారు. అసెంబ్లీలో ఈరోజు మా ఆడబిడ్డలకు జరిగిన అవమానం మొత్తం తెలంగాణ ఆడబిడ్డలకు జరిగిన అవమానమని.. ముఖ్యమంత్రి సిగ్గు బుద్ధి జ్ఞానం తెచ్చుకొని సంస్కరించుకో అంటూ హితవు పలికారు. ఆడబిడ్డలను అడ్డగోలుగా మాట్లాడి పారిపోయిన ముఖ్యమంత్రి రేవంత్ అంటూ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు.

**నేడు సీఎం దిష్టిబొమ్మ దహనాలకు పిలుపు**

బీఆర్ఎస్ సీనియర్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిపై సీఎం చేసిన నీచమైన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనానికి బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం, స్థానం ఉందన్న కనీస సోయి లేకుండా ఆడబిడ్డలను నమ్ముకుంటే ఆగమైతావని.. ఆడబిడ్డలను నమ్ముకుంటే ముంచుతారంటూ.. జీవితం బస్టాండ్ పాలవుతుందంటూ ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా తనస్థాయి మరిచి చేసిన నీచమైన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు కోరారు.

సుదీర్ఘకాలం పాటు ప్రజల మన్ననలు అందుకుంటూ కార్యకర్తల ఆశీర్వాదంతో, అనేక త్యాగాలతో ప్రజలకు సేవ చేస్తున్న ఇద్దరు సీనియర్ మహిళ సభ్యులపై, అహంకారంతో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆడబిడ్డలందరి మనసులను నొప్పించాయని.. జీవితంలో ఎదగాలనుకుంటున్న ప్రతి ఒక్క మహిళకు, ఆడబిడ్డకు ఈ వ్యాఖ్యలు అవమానకరమని కేటీఆర్ అన్నారు. అధికారం, అహంకారంతో రేవంత్ రెడ్డి మాట్లాడిన వ్యాఖ్యలను తెలంగాణ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. వంత్ వ్యాఖ్యలకు నిరసనగా గురువారం ఆయన దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ఆడబిడ్డలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయాలని కేటీఆర్ కోరారు.

## ఒక్క ఉద్యోగం ఇచ్చినట్టు నిరూపిస్తే..
# రాజకీయ సన్యాసం తీసుకుంటా..

- 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఎప్పుడో ఇచ్చామో తేదీలు ఉన్నాయి
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా జరుగుతున్నాయి. బుధవారం ద్రవ్యవినిమయ (బడ్జెట్) బిల్లుపై చర్చలతో అసెంబ్లీ దద్దరిల్లింది. బిల్లును ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు.చర్చలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ ఈ ఎనిమిది నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్క ఉద్యోగం ఇచ్చారని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేసి రాజకీయ సన్యాసం తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సవాల్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అశోక్‌నగర్ వచ్చారు రాహుల్ గాంధీ. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ఏడాది లోపే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. నిజంగా రాహుల్ ట్వీట్, వీరి నిర్వాకం చూసిన తర్వాత గోబెల్స్ బతికి ఉంటే వీళ్ల దగ్గర ట్యూషన్ నేర్చుంటా అని పోతుండే. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని బడ్జెట్‌లో చెప్పారు. నోటిఫికేషన్లు ఎప్పుడు ఇచ్చారు.. పరీక్ష ఎప్పుడు జరిగింది. నియామకాలు ఎప్పుడు ఇచ్చారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు

ఆ 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఎప్పుడో ఇచ్చామో తేదీలు ఉన్నాయి. స్టాఫ్ నర్సులకు 2022 డిసెంబర్ 20న నోటిఫికేషన్ ఇచ్చి 2023 ఆగస్టులో పరీక్షలు నిర్వహించాం. సింగరేణి ఉద్యోగులకు 2022 జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి అదే ఏడాది సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహించాం. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఏప్రిల్ 2022లో నోటిఫికేషన్ ఇచ్చాం. 2022 ఆగస్టులో ప్రిలిమ్స్, 2023 జనవరిలో ఫిజికల్ టెస్టులు, 2023 ఏప్రిల్‌లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించాం. ఇవన్నీ కలిపి 30 వేల ఉద్యోగాలు మేం ఇచ్చాం మేం ఇచ్చాం అంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పరీక్షలు పూర్తయ్యాయి. ఇప్పుడు వీరు నియామక ప్రతాలు ఇచ్చారు. ప్రజలను, నిరుద్యోగ

మిగితా 3వ పేజీలో

## మహేశ్ కో ఆపరేటివ్ బ్యాంకులో ఈడీ సోదాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని మహేశ్ కో ఆపరేటివ్ బ్యాంకులో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం సోదాలు నిర్వహించింది. రూ.300కోట్ల నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై ఈడీ కేసు నమోదు చేసింది. అనర్హులకు రుణాలు ఇచ్చారన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్ సిటీ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లోని ఆరు ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

మహేశ్ బ్యాంకు చైర్మన్ రమేశ్ కుమార్, ఎండీ పురుషో త్తం దాస్‌తో పాటు సీఈవో, డైరెక్టర్ల ఇండ్లలో సోదాలు జరుగుతున్నాయి. సోలిపురం వెంకట్‌రెడ్డి నివాసంలోనూ సోదాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను హవాలా ద్వారా మళ్లించినట్లుగా ఈడీ గుర్తించింది. తనిఖీలకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.



## వయనాడ్‌లో మృత్యుఘోష

- 180 దాటిన మృతుల సంఖ్య

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వయనాడ్‌లో మృత్యుఘోష కొనసాగుతోంది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటి వరకూ అందిన తాజా సమాచారం ప్రకారం.. కొండచరియలు విరిగిపడిన ఘటనలో 180 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇక ఈ ఘటనలో 91 మంది మిస్సింగ్ కాగా, 200 మందికిపైగా ప్రజలు ఆస్పత్రి పాలయ్యారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. వయనాడ్‌లో విపత్తు నిర్వహణ బృందాలు, సైనికులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు

## వికసిత్ భారత్ ప్రస్థానంలో ఐదేండ్లు కీలకం

- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు ఈ ఐదేండ్ల కాలం అత్యంత కీలకమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రాజ్యసభలో బుధవారం 2024-25 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌పై ఆమె మాట్లాడారు. 2014 నుంచి సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఆ దిశగానే ఈ బడ్జెట్‌ను కూడా రూపొందించామని చెప్పారు. బడ్జెట్‌పై విస్తృత చర్చ జరిగిందని, 83 మంది సభ్యులు బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాలుపంచుకున్నారని తెలిపారు. ఈ బడ్జెట్ గతంలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌కు కొనసాగింపేనని చెప్పారు. వృద్ధి, ఉపాధి కల్పన, సంక్షేమం, మూలధన వ్యయం, పెట్టుబడులే ప్రాధాన్యాలుగా బడ్జెట్‌లో ఆయా రంగాలకు పెద్దపీట వేశామని వెల్లడించారు. ఆర్థిక స్థిరీకరణనూ పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. 2025-26 నాటికి ద్రవ్యలోటును జీడీపీలో 4.5 శాతం దిగువకు తీసుకొస్తామని 2021లో సభలో తాను హామీ ఇచ్చానని ఆ దిశగానే ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఐఎంఎఫ్ గణాంకాల ప్రకారం అంతర్జాతీయ వృద్ధిలో భారత్ వాటా 16 శాతంగా ఉందని, అది మరింత పెరగనుందని ఆమె భరోసా ఇచ్చారు. తయారీ రంగం వృద్ధికి బడ్జెట్‌లో పలు ఊతమిచ్చే చర్యలు చేపట్టామని చెప్పారు. దేశం నుంచి మొబైల్ ఫోన్ల తయారీ భారీగా పెరిగిందని తెలిపారు.

# మైక్రో ఎంటర్ప్రైజెస్ విస్తరణకు కట్టుదిట్టమైన చర్యలు




- స్కూల్ యూనిఫామ్ కుట్టు పనిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో రాజన్న సిరిసిల్ల..
- స్వశక్తి రుణాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝు

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల:**

రాబోయే ఐదు సంవత్సరాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు దాదాపు లక్ష కోట్ల రూపాయల రుణాలు అందజేసి ఆర్థికంగా వారిని బలోపేతం చేయాలని ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని రూపొందించిందని, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద స్వశక్తి మహిళా సంఘాలకు అందించే రుణాలతో మహిళలు ఆదాయ వనరులను సృష్టించి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథి గా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం మన జిల్లాలో ఉన్న మహిళా సంఘాలకు 500 కోట్ల రూపాయల రుణాలు అందజేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని, స్వశక్తి మహిళా సంఘాలకు అందించే రుణాలను చిన్న చిన్న వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు వినియోగించాలని అన్నారు. మహిళలు తమకు అందే రుణాలను వినియోగించి ఆదాయ వనరులను సృష్టించుకోవాలని,

మహిళా సంఘాలకు వివిధ వ్యాపారాల ఏర్పాటు పట్ల అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేసిందని అన్నారు. పాడి పశువులు, కుట్టు మిషన్ కేంద్రాలు, మీ సేవా కేంద్రాలు, కుటీర పరిశ్రమలు, పౌల్ట్రీ, ఆహార శుద్ధి కేంద్రాలు కష్టం హైరింగ్ సెంటర్స్, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్లెట్స్, మిల్క్ పార్లర్స్, క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్మెంట్ ,ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ మొదలగు రంగాలలో మహిళలు వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సలహాలు ఇతర సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం అందిస్తుందని అన్నారు.

ప్రస్తుత సంవత్సరం మన జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 1800 , ఈడి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మరో 600 పాడి పశువుల యూనిట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, కరీంనగర్ మిల్క్ డైరీ యూనిట్ తో వీరిని సమన్వయం చేస్తామని, ఆసక్తి అర్హత కలిగిన మహిళా సంఘాల ద్వారా వీటిని ఏర్పాటు చేస్తామని అన్నారు.

జిల్లాలో 5123 మైక్రో ఎంటర్ప్రైజెస్ ఏర్పాటు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నామని, ప్రస్తుతం ఉన్న 3392 వ్యాపార యూనిట్ల విస్తరణ, 1607 నూతన వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా మన జిల్లాలో 31 యూనిట్ లు ఏర్పాటు చేసి స్కూల్ ఏకరూప దుస్తులు కుట్టించామని అన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 120 ఆహార శుద్ధి కేంద్రాల, 5 కష్టం హైరింగ్ సెంటర్లు, 1 మిల్క్ పార్లర్, 4 అమ్మ క్యాంటీన్లు, 1 ఈ వెట్ మేనేజ్మెంట్ , 1 ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ ఏర్పాటు లక్ష్యంగా పని చేస్తున్నామని, ఆసక్తి అర్హత కలిగిన మహిళ సంఘాలచే వీటిని ఏర్పాటు చేయించి ఆర్థికంగా నిల దొక్కుకునేందుకు సంపూర్ణ సహకారం అందజేస్తామని అన్నారు. మహిళా సంఘాల ద్వారా మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, మన సిరిసిల్ల జిల్లాలో 10 నూతన మీ సేవా కేంద్రాలను మహిళలచే ఏర్పాటు చేస్తామని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, అదనపు డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు సరిత, డి ఓ కరీంనగర్ డైరీ డాక్టర్ జయకర్, పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ స్వప్న,డిడిఎం నాబార్డ్ దిలీప్,లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్, జిఎం ఇండస్ట్రీస్ భారతి పిడిఎఫ్ శ్రీనివాస్, జోనల్ మేనేజర్ శ్రీనిధి రవికుమార్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం



- పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెదలాలి...

**బలగం టీవీ, గంభీరావుపేట**

సిరిసిల్ల జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని,గంజాయి అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని,గంజాయి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం గంభీరావుపేట పోలీస్ స్టేషన్ను ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి, దొంగతనం కేసులలో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, నమోదైన పలు కేసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో గంజాయి, దొంగతనం కేసులలో ఉన్న పాత నెరస్థులపై పోలీస్ నిఘా ఎప్పుడు ఉంటుందని, వారు తమ తమ నెరప్రవృతిని మార్చుకొని సత్ప్రవర్తనతో మేధాలలని లేనియెడల హిస్టరీ షీట్స్, పిడి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో గంజాయి కిట్లతో తనిఖీలు చేస్తున్నామని, గంజాయి పాజిటివ్ వచ్చిన వారి నుంచి సరఫరా దారులను పట్టుకుంటున్నామని అన్నారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నడుస్తున్నాయని అడిగి తెలుసుకొని, డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలన్నారు.సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందరి దగ్గర ఉండాలని,గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రామ్మోహన్ ,సిబ్బంది పాల్గొన్నారు.




# సాదాసీదాగా సిరిసిల్ల మున్సిపల్ సమావేశం..

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్ల పురపాలక సంఘం పాలకవర్గం సాధారణ సమావేశం సాదాసీదాగా సాగింది. చైర్పర్సన్ కళా చక్రపాణి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. ప్రజల అవసరాలను మరియు పురపాలక సంఘ వార్డ్ ల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 15 అంశాలపై చర్చించి తీర్మానం చేశారు.ఎజెండా ప్రకారం అభివృద్ధి, నీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితరంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ వార్డులలో దెబ్బతిన్న సిసి మరమ్మతుల కోసం 10 లక్షల రూపాయల ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు .తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం, పారిశుద్ధ్య కార్మికుల కోసం సేఫ్టీ కిట్స్, రైన్ కోట్స్ మరియు ఇతర పనిముట్లు కొనుగోలు చేయుటకు ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పలు అంశాలను ఆమోదిస్తూ పురపాలక సంఘం పాలకవర్గం 15 తీర్మానలు చేయడమైనదనిఅన్నారు. అనంతరం బదిలీల్లో భాగంగా సిరిసిల్ల పురపాలక సంఘానికి వచ్చిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య , వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ , కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు,మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుల జీవితాల్లో వెలుగు నింపిన ప్రభుత్వం




- రాజన్న సిరిసిల్ల జిల్లా సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి

**బలగం టీవీ , సిరిసిల్ల**

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు వేతనాలు పెంచి, కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపిందని రాజన్న సిరిసిల్ల జిల్లా సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎడమల శ్రీధర్ రెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులను,గత ప్రభుత్వం 583 మంది కీ ఉద్యోగాలు ఇచ్చి వారికి స్వరాష్ట్రంలో తగిన గౌరవం ఇచ్చిందని అన్నారు. గత పది సంవత్సరాల నుండి 24,514 రూపాయల గౌరవ వేతనం ఇచ్చిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 583 మంది కళాకారులకు పిఆర్సి 30% కీ పెంచి 24,514ఉన్న జీతాన్ని 31 868 రూపాయలకు పెంచి కళాకారుల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపిందని అన్నారు.కళాకారులకు సముచిత స్థానాన్ని ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపినటువంటి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క,సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు,జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ వేములవాడ శాసనస భ్యులు అది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కే కే మహేందర్ రెడ్డి కీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీరాముల రామచంద్రం,సీనియర్ సారథి కళాకారుడు ఆకునూరి దేవయ్య,గడ్డం దేవయ్య, గడ్డం శ్రీనివాస్, వేములవాడ టీం లీడర్ పొత్తూరి రాజు, ప్రధాన కార్యదర్శి వంతడుపుల ఝాన్సీ పూడూరు సంజీవ్, కిన్నెర శ్రీలత, అనుముల శిరీష అంతడుపుల లావణ్య లు పాల్గొన్నారు.

# అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్ష.

**బలగం టీవీ, గంభీరావుపేట**

అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతో పాటు 1000 రూపాయల జరిమానా విధిస్తూ, సిరిసిల్ల ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సృజన బుధవారం తీర్పు వెల్లడించినట్లు గంభీరావుపేట ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్సై రామ్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామానికి చెందిన కుంట నాగరాజు కు గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన ఓ మహిళకు 2005 సంవత్సరంలో వివాహం జరిగింది.కొంత కాలం వీరి కాపురం సజావుగా జరిగింది. వీరికి ఇద్దరు అమ్మాయిలు సంతానం కలుగగా కొన్నేళ్ల తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భార్యను భర్త వేధింపులకు పాల్పడ్డాడు. వేధింపులు భరించలేక నాగరాజు పై 2009 లో గంభీరావుపేట పోలీస్ స్టేషన్లో భార్య ఫిర్యాదు చేయగా , పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ యమగంటి సతీష్ గౌడ్ వాదించగా గంభీరావుపేట ఎస్ఐ, సీఎంస్ ఎస్ఐ. రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ జనార్దన్ రెడ్డి ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో నిందుతుడు నాగరాజు కు న్యాయమూర్తి ఏడాదిన్నర జైలు శిక్షతో పాటు 1000 రూపాయల జరిమానా విధించారు.

# డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ పంతగాని పెంచలయ్య



**బలగం టీవీ , సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని హాస్పిటల్స్ సమన్వయ అధికారిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ పంతగాని పెంచలయ్య బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన హాస్పిటల్లో బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ పెంచలయ్య రాజన్న సిరిసిల్ల మంచి సర్జన్ గా మంచి గుర్తింపు పొంది, రికార్డు స్థాయిలో ఆపరేషన్లు చేసిన అనుభవం కలిగిన డాక్టర్ గా ప్రజల్లో ఆదరణ పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ పంతగాని పెంచలయ్య మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు . ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను డాక్టర్ పెంచలయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు.

# మత్తు పదార్థాలకు యువత బానిస కాకూడదు

- ఎడమల సీఐ వెంకటేశ్వర్లు..
- గంజాయి అనుమానితులకు టెస్ట్‌లు నిర్వహించిన పోలీసులు



**బలగం టీవీ, రుద్రంగి**

యువత గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిస కాకూడదని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు.. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి గ్రామపం చాయతీ ఆవరణలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు గంజాయి సేవించారనే అనుమానంతో కొందరు యువకులకు టెస్ట్ లు నిర్వహించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా ఇటీవల ఎస్పీ అఖిల మహాజన్ జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్కు డ్రంక్ అండ్ డ్రైవ్ తరహా గంజాయి టెస్ట్ మిషన్లను అందుబాటులో ఉంచారని అన్నారు. గంజాయి సేవించిన వ్యక్తులను టెస్ట్ కిట్ల ద్వారా గుర్తించడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని సూచించారు. గంజాయి సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఇందూరి రవి, ఓదెలు, తదితరులు ఉన్నారు...

# నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలో మండెపల్లి యువకుడి ప్రతిభ




**బలగం టీవీ, తంగళ్లపల్లి**

వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోవాలో నిర్వహించిన నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలో కిక్ బాక్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ మహారాష్ట్ర తరపున రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండెపల్లి గ్రామానికి చెందిన మెరుపుల హృతిక్ గౌడ్ నేషనల్ ఛాంపియన్ గా గెలుపొందాడు.వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ సంతోష్ కే అగర్వాల్, జనరల్ సెక్రటరీ సంజయ్ కుమార్, మెమొంటో అందజేశారు. నేషనల్ పోటీలో గెలుపొందిన హృతిక్ కి మండెపల్లి గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

# గుండారంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట:**


రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గుండారం గ్రామంలో బుధవారం రుణమాఫీ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి గ్రామస్తులు రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తున్న రేవంత్ రెడ్డి పట్ల రైతులకు ఎనలేని ప్రేమ కుదిరింది అన్నారు. రైతులకు ఒకవైపు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తూనే రైతు భరోసా కూడా ఇస్తానని చెప్పడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పంటలు నష్టపోతే నష్టపరిహారం కూడా బీమా ద్వారా చెల్లిస్తామని చెప్పటంతో రైతులకు మరింత కష్టం తప్పిందన్నారు. అక్కడక్కడ కొంతమంది బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ ప్రచారాన్ని నాయకులు కార్యకర్తలు ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. ప్రభుత్వం ఒకవైపు సంక్షేమ కార్యక్రమాలను మరోవైపు శాశ్వత పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, నాయకులు పందిర్ల సుధాకర్ గౌడ్, దేవేందర్,బండారి బాల్ రెడ్డి, నేలపల్లి శ్రీనివాస్,సూడిద రాజేందర్,బానోతు రాజు నాయక్, భాస్కర్, మల్లయ్య,, శ్రీనివాస్, నారాయణ,నర్సయ్య,మధు పాల్గొన్నారు.

# బాలికపై లైంగికదాడి.. దోషికి ఉరి శిక్ష




**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువడించింది. బాలికపై లైంగికదాడి కేసులో దోషికి ఉరి శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది. 2018లో నార్సింగిలో నాలుగున్నరేళ్ల బాలికపై దినేష్ లైంగికదాడి చేసి, ఆపై హత్య చేశాడు. ఈ కేసులో 2021లోనే రంగారెడ్డి కోర్టు దోషికి ఉరిశిక్ష విధించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ నిందితుడు హైకోర్టును ఆశ్రయించాడు. ఇవాళ ఆ పిటిషన్‌పై విచారణ జరగ్గా రంగారెడ్డి కోర్టు తీర్పును రాష్ట్ర హైకోర్టు సమర్థించింది. కాగా, బాలికపై లైంగికదాడి చేసి హత్య చేసిన యువకుడు సెంట్రింగ్ పనిచేసే కార్మికుడిగా పోలీసులు గుర్తించారు.



# రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షున్ని కలిసిన జిల్లా లీగల్ సెల్ సభ్యులు

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ ని హైదరాబాదులోని హై కోర్ట్ లో తన చాంబర్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ లీగల్ చైర్మన్ ఇరుకుల్ల అశ్విన్ చంద్ర , వైస్ ప్రెసిడెంట్ కొండాపురం వెంకట్ రెడ్డి, మరియు కన్వీనర్ పుప్పాల భాను కృష్ణ లు మర్యాద పూర్వకంగా కలిసి,సిరిసిల్ల లీగల్ సెల్ కమిటీలో అవకాశం కల్పించి, ఎన్నికకు సహకరించినందుకు పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

# జూకంటికి ఆత్మీయ సత్కారం..



**బలగం టీవీ, సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దాశరథి రాష్ట్రస్థాయి పురస్కారం పొందిన ప్రముఖ కవి,రచయిత జూకంటి జగన్నాథం ను సిరిసిల్ల పట్టణంలోని జూకంటి నివాసంలో సీనియర్ జర్నలిస్టులు కరణాల భద్రాచలం, ఊరడి మల్లికార్జున్, కాయితి బాలు, అల్లే రమేష్, ఆడేపు లక్ష్మణ్ కలిసి,పుష్పగుచ్చం అందించి, శాలువతో ఘనంగా సత్కరించారు.

# అర్ధరాత్రి కారు బీభత్సం..

- ఇద్దరికి తీవ్ర గాయాలు

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దగ్గర మంగళవారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. సాకేత్ రెడ్డి అనే విద్యార్థి మద్యం మత్తులో అతివేగంగా కారు నడపడంతో అది అదుపుతప్పి.. టెలిఫోన్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. దాంతో కారు డోర్లు దెబ్బతిని దానిలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అందులోనే ఇరుక్కుపోయారు.ఇది గమనించిన స్థానికులు అతికష్టం మీద ఆ ఇద్దరినీ బయటికి తీశారు. తీవ్రంగా గాయపడిన ఆ ఇద్దరు వ్యక్తులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారు నడిపిన సాకేత్‌రెడ్డికి పోలీసులు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయగా 146 పాయింట్లు చూపింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# లొంగిపోయిన ఐదుగురు నక్సలైట్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో బుధవారం ఐదుగురు నక్సలైట్లు లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఒకరిపై రూ. 1 లక్ష రివార్డు ఉంది. సీనియర్ నాయకులు చేస్తున్న అకృత్యాలకు, అమానుష, డొల్ల మావోయిస్టు సిద్ధాంతాల పట్ల విరక్తి చెంది తాము స్వచ్ఛందంగా లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు నక్సల్స్ తెలిపినట్లు పోలీసులు చెప్పారు. మావోయిస్టులు నిర్వహించే అమరవీరుల వారోత్సవాల వేళ ఐదుగురు నక్సలైట్లు లొంగిపోవడాన్ని గణనీయమైన పరిణామంగా పోలీసులు అభివర్ణించారు. లొంగిపోయిన నక్సలైట్లకు రూ. 25 వేల చొప్పున సహాయంతోపాటు ప్రభుత్వ విధానం ప్రకారం పునరావాసం కల్పించనున్నట్లు వారు చెప్పారు.

## ఒక్క ఉద్యోగం ఇచ్చినట్టు నిరూపిస్తే..

# రాజకీయ సన్యాసం



(మొదటిపేజీ తరువాయి)

యువతను తప్పుదోవ పట్టించిన మీ మీద ఛార్జిషీటు వేయాలి. జాబుల జాతర బదులు అబద్దాల జాతర నడుస్తుంది. ఇంట్లో ఉన్న క్యాలెండర్ మరో నాలుగు నెలల్లో మారిపోతది కానీ జాబ్ క్యాలెండర్ అత్త లేదు.. పత్త లేదు అని కేటీఆర్ విమర్శించారు.

**సీఎం రేవంత్‌ను కూడా తీసుకెళ్దాం..**

ఎన్నికల సమయంలో అశోక్‌నగర్‌కు, ఉస్మానియా యూనివర్సిటీకి పరుగులు పెడుతూ వెళ్లారు. సభ వాయిదా వేయగానే డిప్యూటీ సీఎం భట్టి, అవసరమైతే సీఎం రేవంత్‌ను కూడా తీసుకెళ్దాం. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా పర్సనల్‌గా వెళ్దాం. అశోక్‌నగర్‌లో ఏ ఒక్క యువతి, యువకుడు అయినా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్తగా ఒక్క ఉద్యోగం వచ్చిందని చెప్పినా.. అక్కడే నేను రాజీనామా చేసి రాజకీయ సన్యాసం తీసుకుంటాను. కొత్తగా ఉద్యోగాలు ఇచ్చారని ఎవరైనా చెబితే అక్కడే ఉన్న సిటీ సెంట్రల్ లైబ్రరీలో మా పార్టీ తరపున లక్షలాది యువకులతో సీఎం, డిప్యూటీ సీఎంకు పౌర సన్మానం చేయిస్తానని కేటీఆర్ తెలిపారు.

అప్పులపై తప్పుడు ప్రచారం చేయొద్దని.. అలా చేస్తే రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందంటే ఎవరూ పెట్టుబడులు పెట్టబోరని.. కాంగ్రెస్ నేతలు పెరిగిన సంపదను దాచిపెట్టి అప్పుల గురించి మాత్రమే మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే కేటీఆర్ హితవు పలికారు. అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై ఆయన మాట్లాడారు. తెలంగాణను అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టులోనే విరుద్ధ ప్రకటనలు ఉన్నాయన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నికర అప్పు 3 లక్షల 85 వేల 340 కోట్ల రూపాయలు మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. 6 లక్షల 71 వేల కోట్ల రూపాయల అప్పు ఉందని కాంగ్రెస్? ప్రభుత్వం దుష్ప్రచారం చేయడం సరికాదని మండిపడ్డారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని సూచించారు. దేశంలో ఎన్నో రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ మెరుగైన స్థితిలో ఉందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ చీకట్లో నిండిపోతుందని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి లాంటి వాళ్లు చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణ వారికి పాలించే సత్తా లేదని, ఉమ్మడి రాష్ట్రంలో చాలా మంది ఎద్దేవా చేశారన్నారు. పదేళ్లలో రాష్ట్ర ఆదాయం భారీగా పెరిగిందని విపక్షంలో ఆనాడు భట్టి విక్రమార్క చెప్పారని గుర్తు చేస్తూ అధికారంలోకి వచ్చిన తర్వాత మాటమార్చారని విమర్శించారు. తెలంగాణ వచ్చినప్పుడు 2014లో రెవెన్యూ 26 వేల కోట్లు ఉంటే.. 2024లో లక్షా 60 వేల కోట్లుగా ఉందని వివరించారు. తమ హయాంలో తెలంగాణ పరపతి పెరిగిందని గుర్తుచేశారు.

కరోనా వల్ల ఆర్థిక సంక్షోభం జరిగిన విషయం అందిరికీ తెలిసిందే అని, కరోనా వల్ల ఆర్థిక నష్టం జరిగినప్పటికీ కల్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్‌కు ఇచ్చే డబ్బులు ఆపలేదని కేటీఆర్ గుర్తు చేశారు. ఉద్యోగులకు కొందరికి జీతాలు ఆలస్యంగా ఇచ్చి ఉండొచ్చునని అన్నారు. కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్లకు 10 నెలలుగా జీతాల్లేవు అని, వారికి జీతాలు చెల్లించాలని కోరారు.

బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం టాటా చెప్పిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన గురించి మీరు ప్రస్తావించినప్పుడు గత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తామెందుకు మాట్లాడకూడదని ప్రశ్నించారు. సీఎం సీటులోకి భట్టి వెళ్లాలని కోరారు. మంచి నిర్ణయాలకు బీఆర్ఎస్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని చెప్పారు. కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో అరచేతిలో స్వర్గం చూపించిందని, బడ్జెట్‌లో మాత్రం మోచేతికి బెల్లం పెట్టిందని రేవంత్ రెడ్డి సర్కార్‌పై నిప్పులు చెరిగారు. ఇప్పుడు ఎన్నికలు లేవు.. మీకు ప్రజలు అవకాశం ఇచ్చారు.. నాలుగున్నరేళ్ల పాటు కలిసిమెలిసి పనిచేసి ఉజ్వల తెలంగాణగా తీర్చిదిద్దుదాం.. అందుకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని కేటీఆర్ అన్నారు. ప్రతిపక్ష పార్టీగా ఈ రాష్ట్ర ప్రజల బాగు కోరుతూ మీరు తీసుకునే నిర్ణయాత్మక నిర్ణయాలకు సహకారం అందిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## సీఎం మాటలతో

# అసెంబ్లీలో మంటలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించిన వెంటనే ఆమె బీఆర్ఎస్‌లో చేరారని ఎద్దేవా చేశారు. అధికారం కోసం కాంగ్రెస్‌ను వదిలి బీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవి తీసుకున్నారని, తమ్ముడిగా తనను మోసం చేశారని రేవంత్ విమర్శించారు.

**రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతల ఆందోళన**

రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు సభలో ఆందోళన చేపట్టగా ఉప ముఖ్యమంత్రి స్పందించారు. ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. 2004లో వేరే పార్టీలో ఉన్న సబితా ఇంద్రారెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకుని సబితకు టికెట్ ఇచ్చి 2004, 2009 లో ఆమెకు కీలక మంత్రి పదవి ఇచ్చిందని భట్టి తెలిపారు. దశాబ్ద కాలం మంత్రిగా ఉన్న ఆమెకు 2014 లోనూ కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని కానీ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఆమె అధికారం కోసం పార్టీ మారారని భట్టి విక్రమార్క విమర్శించారు. అధికార పార్టీ నేతల వ్యాఖ్యలతో సభాపతి పోడియం ముందు బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. సీఎం ఇష్టం వచ్చినట్లు మాట్లాడి బయటకు వెళ్లిపోతారా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇక సీఎం రేవంత్ రెడ్డి మాటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు లు వివరణ ఇస్తూ, సభా నాయకుడు సబిత పేరు పెట్టి మాట్లాడలేదని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ఎవరి గురించి మాట్లాడలేదు, ఒక సూచన, సలహా ఇచ్చారు అంతే అని శ్రీధర్ బాబు అన్నారు. దీంతో ఆయన క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నారు..



**అసలు సీఎం ఏమన్నారంటే...**

వెనకాల ఉండే అక్కలు.. ఇక్కడ ఉండి చెప్పి చెప్పి ఇక్కడ ముంచి అక్కడ తేలారు. ఆ అక్కల మాటలు వింటే జూబ్లీ బస్టాండ్లో కూర్చోవాల్సి వస్తది అని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. సీఎం ఏ పార్టీలో నుంచి వచ్చారు..? ఏ పార్టీ నుంచి ఏ పార్టీలోకి మారారు.? వీటిన్నింటిపై తప్పకుండా చర్చ పెడుతాం. కేసీఆర్ ఇంటి మీద వాలిన కాకి నా ఇంటి మీద వాలితే కాల్చేస్తా అని రేవంత్ రెడ్డి అన్నారు. మరి ఎంత మంది ఉన్నారు.. ఎంత మందిని కాల్చేస్తారు. ఎందుకు చేర్చుకున్నారు..? ఇప్పుడేమో సీఎం ఎంజాయ్ చేస్తున్నారు అని నిప్పులు చెరిగారు. గుండె మీద చేయి వేసుకుని చెప్పాలి సీఎం. ఆ రోజు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినప్పుడు ఒక అక్కగా రేవంత్‌ను ఆశీర్వదించాను. బాబు నువ్వు గొప్పగా ఎదుగుతావు.. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతావు అని చెప్పి పార్టీలోకి ఆహ్వానించాను. ఇప్పుడు నా మీద ఎందుకు కక్ష తీర్చుకుంటున్నారో నాకు అర్థం కావడం లేదు. ఎందుకు నన్ను టార్గెట్ చేశారు. నీ వెనుకాల కూర్చున్న అక్కలను నమ్ముకోవద్దు మోసం చేస్తరు అని సీఎం అన్నారు. ఏం మోసం చేసినం అధ్యక్షా..? ఏం ముంచినం అధ్యక్షా..? ఈయనను ముంచామా అధ్యక్షా..? ఈయనను బతిమాలిడి పార్టీలోకి రావాలని, భవిష్యత్‌లో ఈ పార్టీకి ఆశా కిరణం అవుతావు అని ఆహ్వానించాను. రేవంత్‌ను గుండె మీద చేయి వేసుకోమని చెప్పమను. ఏం మోసం చేశాను.. ఎన్నికల సమయంలో కూడా అదే మాట్లాడారు. ఎందుకు టార్గెట్ చేస్తున్నారు. ఎందుకు అవమానిస్తున్నావ్.. నాపై చేసిన వ్యాఖ్యలను రేవంత్ విత్ డ్రా చేసుకోవాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

## కేరళను ముందే హెచ్చరించాం

● కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

భారీ వర్షాల నేపథ్యంలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని కేరళ ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించినట్లు కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ ప్రకృతి వైపరీత్యం గురించి పినరయి విజయన్ నేతృత్వంలోని కేరళ ప్రభుత్వాన్ని వారం రోజుల ముందే అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేరళలో చోటు చేసుకున్న ప్రకృతి వైపరీత్యంపై పార్లమెంట్‌లో ప్రకటన చేశారు. 'కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని కేరళ ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించాం. ఈ ముప్పు గురించి జులై 23నే అప్రమత్తం చేశాం. దక్షిణాది రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసి.. కేంద్రం తొమ్మిది ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కేరళకు పంపింది. కానీ, కేరళ ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. సకాలంలో ప్రజలను తరలించలేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందాల రాకతో పినరయి విజయన్ ప్రభుత్వం అప్రమత్తమై ఉండి ఉంటే.. ఇప్పుడు ఇన్ని మరణాలు సంభవించేవి కావు. ఏది ఏమైనప్పటికీ రాజకీయాలకు అతీతంగా కేరళ ప్రభుత్వానికి, ప్రజలకు అండగా నిలవాల్సిన సమయం ఇది' అని అమిత్‌షా పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల గురించి కనీసం ఏడు రోజుల ముందుగానే హెచ్చరికలు ఇవ్వగల నాలుగు దేశాల్లో భారత్ కూడా ఒకటని ఈ సందర్భంగా అమిత్ షా పార్లమెంట్‌కు తెలిపారు.

## ఇది నిందారోపణలకు సమయం కాదు


● కేరళ సీఎం పినరయి విజయన్



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

: భారీ వర్షాల నేపథ్యంలో వయనాడ్‌లో భారీ వైపరీత్యం ముంచుకొస్తుందని కేరళ రాష్ట్రాన్ని జులై 23నే హెచ్చరించామని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా బుధవారం పార్లమెంట్‌లో పేర్కొనడంపై కేరళ సీఎం పినరయి విజయన్ స్పందించారు. ఇది పరస్పర నిందారోపణలకు సమయం కాదని స్పష్టం చేశారు. తాము ముందే హెచ్చరించినా కేరళ తగిన విధంగా స్పందించి అప్రమత్తం కాలేదని అమిత్ షా పార్లమెంట్‌లో పేర్కొనడాన్ని ఉద్దేశించి విజయన్ ఈ వ్యాఖ్యలు చేశారు. కొండచరియలు విరిగిపడే ముందు ఐఎండీ కేవలం జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ మాత్రమే జారీ చేసిందని విజయన్ గుర్తుచేశారు. ఐఎండీ అంచనాలకు మించి వయనాడ్‌లో 500మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. వాస్తవంగా అంతకుమించే వర్షాలు కురిశాయని సీఎం తెలిపారు. ఇది ఐఎండీ ముందస్తు హెచ్చరికల కంటే చాలా అధికమని చెప్పారు. వైపరీత్యానికి ముందు ఈ ప్రాంతం ఎన్నడూ రెడ్ అలర్ట్‌లో లేదని పేర్కొన్నారు. ఈ ఘటన జరిగిన అనంతరం ఉదయం ఆరు గంటలకు రెడ్ అలర్ట్ జారీ చేశారని తెలిపారు

## నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం మధ్యాహ్నం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరుగనుంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో తొలుత సచివాలయంలో నిర్వహించాలనుకున్న కేబినెట్ భేటీ అసెంబ్లీ కమిటీ హాల్‌కు మారింది. మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో మంగళవారం ఉదయం ప్రవేశపెట్టిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుపై ఈ సమావేశం చర్చించనుంది. ఆ తర్వాత అసెంబ్లీ, మండలిలో చర్చ జరుగనుంది. ఈ అంశానికి తోడు కొత్త రేషన్ కార్డుల జారీపైనా కేబినెట్ చర్చించి విధి, విధానాలను ఖరారు చేయనున్నారు. గతేడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరిల మధ్య నిర్వహించిన ప్రజాపాలన స్పెషల్ డ్రైవ్‌లో వచ్చిన అభయహస్తం దరఖాస్తుల్లో కొత్త రేషన్ కార్డుల జారీ దరఖాస్తులపై స్పెషల్ కమిటీ ఇప్పటికే లోతుగా అధ్యయనం చేసింది.

కొత్త రేషన్ కార్డులను ఎప్పుడు జారీ చేస్తారంటూ ప్రజల నుంచి ఇటు విపక్షాల నుంచి డిమాండ్ వస్తున్న నేపథ్యంలో కేబినెట్ భేటీలో దీనిపై చర్చించి నిర్దిష్టమైన విధి, విధానాలను, అర్హతలను, జారీకి సంబంధించి షెడ్యూల్‌ను ఖరారు చేసే అవకాశమున్నట్టుగా తెలిసింది. మరోవైపు హైదరాబాద్ అభివృద్ధితో పాటు మూసీ ప్రక్షాళన, మౌలిక సౌకర్యాల కల్పన, రీజనల్ రింగురోడ్డు నిర్మాణం, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు విస్తరణ తదితర పలు అంశాలకు సంబంధించి కూడా చర్చించనున్నట్లుగా తెలిసింది. ఇందులో కొన్ని పనులకు ప్రపంచ బ్యాంకు నుంచి ఆర్థిక సాయం పొందాలని ప్రభుత్వం భావిస్తున్నందున కేబినెట్ భేటీలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

## చాలా మంది రైతులకు రుణ మాఫీ జరగలేదు



● కంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో చాలా మంది రైతులకు రుణ మాఫీ జరగలేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. మరోవైపు భవిష్యత్‌లో చాలా మంది రైతులకు బ్యాంకులు రుణాలిచ్చే పరిస్థితి లేదని అన్నారు. కౌలు రైతులకు, రైతు కూలీలకు సహాయం అందిస్తామని చెప్పి ఆ హామీ కూడా నెరవేర్చలేదని అన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో రుణ మాఫీ అందని వారి కోసం హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీ నైజమని వ్యాఖ్యానించారు. ఏ విడతలో కూడా రైతులకు న్యాయం జరుగడం లేదని తెలిపారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీజేపీ పోరాడుతుందని హామీ ఇచ్చారు.

ఎందుకు రుణమాఫీ కాలేదో మండలాల వారీగా, గ్రామాల వారీగా ప్రజలకి, రైతులకు ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్షలాది రూపాయలతో రేవంత్ రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారని, వేలాది లీటరులతో పాలాభిషేకం చేయించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ కాని వారు, రైతు భరోసా అందని రైతులు సీఎం రేవంత్ రెడ్డికి ఉత్తరాలు రాయాలని పిలుపునిచ్చారు. కౌలు రైతులకు, రైతు కూలీలకు డబ్బులు ఇస్తామని చెప్పారని, రైతులకు పంట బోనస్ ఇవ్వలేదని, ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీ నైజం అని మండిపడ్డారు. మోసగించడం ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని ఆయన కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు వెన్నుపోటు పొడిచిందని, అందుకు ఇప్పుడు ఫలితం అనుభవించిందని అన్నారు. రైతులు కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించాలని అన్నారు. కంటి తుడుపు చర్యగా, నామ మాత్రంగా ఈ ప్రభుత్వం రుణమాఫీ చేస్తోందని విమర్శించారు.

తొలి విడతలో భాగంగా రూ.లక్ష రుణమాఫీ చేసిన ప్రభుత్వం, రెండో విడతలో రూ.1.50 లక్షల వరకు మాఫీ చేసిందని అన్నారు. ఇక ఆగష్టు 15వ తేదీలోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, తొలి విడతలో రూ.6098 కోట్లు, రెండో విడతలో రూ.6190 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. మొత్తంగా రెండు విడతల్లో కలిపి 17 లక్షల 75 వేల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.12 వేల 224 కోట్లు ప్రభుత్వం జమ చేసిందని అన్నారు. సోనియా గాంధీ ప్రతి ఇంటికి లెటర్ పంపించారని, ఇప్పుడు ఆరు గ్యారంటీల అమలులో ఎందుకు చొరవ చూపడం లేదని, బడ్జెట్ మసి పూసి మారేడు కాయ చేసేలా ఉందన్నారు. రైతుకు, మహిళలకు, యువతకు, బీసీలకు వెన్నుపోటుతో మోసం చేసిందని ఆరోపించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీల బడ్జెట్ ను తగ్గించారని అన్నారు. బడ్జెట్‌లో గాలి లెక్కలు, నీటి మీద రాతలు అని కిషన్ రెడ్డి విమర్శించారు.

## ఎమ్మెల్యేల సభ్యత్వాలూ రద్దు కావచ్చు

● సీఎం రేవంత్‌రెడ్డి

సమయం, సందర్భాన్ని బట్టి కొందరు ఎమ్మెల్యేల సభ్యత్వాలూ రద్దు కావచ్చునని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ తొలి శాసనసభలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా కుర్చీలో నుంచి లేచి నిలుచున్నారన్న కారణంతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ సభ్యత్వాలను రద్దు చేశారని, అప్పుడు వారు స్పీకర్ పోడియం వద్దకు కూడా వెళ్లలేదని.. 2014 నుంచి 2018 వరకూ ఏ ఒక్క సమావేశంలోనూ తనను ఉండనీయ లేదని, సభకు వచ్చిన వెంటనే తీసుకెళ్లి బయటకు తోసేశారని గుర్తు చేశారు. ఇప్పుడూ సభ్యుల శాసనసభ సభ్యత్వాలను స్పీకర్ రద్దు చేసినా చెయ్యవచ్చన్నారు. సభలో సస్పెన్షన్లు, బహిష్కరణలు, మార్షల్స్ అవసరం రావద్దనే తాను కోరుకుంటున్నానన్నారు. అసెంబ్లీలోని తన చాంబర్లో బుధవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా రేవంత్.. మాట్లాడారు. "మోసం అనే పదానికి పర్యాయపదం సబిత అని భట్టి గారు చెప్పారు. సునీతక్క కోసం 2018 ఎన్నికల్లో ప్రచారానికి పోతే నా మీద రెండు కేసులు పెట్టారు. కొడిపల్లి, నర్సాపూర్ లో ఇప్పటికీ కేసులున్నాయి. అక్క అధికార పార్టీలోకి వెళితే.. వాళ్ల కోసం ప్రచారం చేసిన తమ్ముడి మీద కేసులు తియ్యాలా వద్దా..? మహిళా కమిషన్ పోస్టు తీసుకొని.. తర్వాత ఎమ్మెల్యే అయిపోతే సరిపోతుందా.. అక్కల మాటలు నమ్మి నేను మోసపోయాను అని కేటీఆర్ కు చెప్పిన.. సభలో నేను వాళ్ళ పేర్లు కూడా ప్రస్తావించలేదు. నన్ను కాంగ్రెస్ లోకి రమ్మని చెప్పిన సబిత అక్క నాకు అండగా ఉండాల్సింది పోయి పార్టీ మారింది. నా ఎన్నికల బాధ్యత తీసుకుంటానని చెప్పిన అక్క.. నేను నామినేషన్ వేసేటప్పటికే వ్యతిరేక ప్రచారం మొదలుపెట్టారు. సభలో నేను మాట్లాడిన దాంట్లో అన్ పార్లమెంటరీ లేదు. నేను ఒక్కమాట కూడా అసభ్యంగా మాట్లాడలేదు. సబితక్క కు కూడా మాట్లాడేందుకు అవకాశం ఇచ్చాము. అక్క వ్యక్తిగత విషయాలను మాట్లాడినందుకే, తర్వాత నేను మిగతాది పూర్తి చేసిన. సబితక్కకు అవమానం జరిగితే, అన్యాయం జరిగితే, సబితక్క ఇంత అవేదన చెందితే కేసీఆర్, హరీష్ రావు ఎటు పోయారు.. అసెంబ్లీకి ఎందుకు డుమ్మాకొట్టారు. సభలోకి వచ్చి సబితక్కకు అండగా నిలబడాలి కదా. తమ పార్టీ సభ్యులను పట్టించుకోకుండా కేసీఆర్ ఎందుకు పత్తాకు లేకుండా పోయాడు..? సభలో మాట్లాడేందుకు కేటీఆర్, హరీష్ రావు చాలు అనుకుంటే, కేసీఆర్ ను ఎందుకు ఫ్లోర్ లీడర్ గా ఎన్నుకున్నారు..? ఫ్లోర్ లీడర్ గా తొలగించాలి.. కేసీఆర్ కు బాధ్యత లేదు. రాష్ట్రం పట్ల పట్టింపు లేదు. కేసీఆర్ కు కేవలం అధికారం కావాలి. అధికారం లేకపోతే ప్రజల సమస్యలను పట్టించుకునే ఆలోచన లేదు. అటువంటి మంచి అలవాటు ఆయనకు లేదు.

గడిచిన పదేండ్లతో పోలిస్తే.. అసెంబ్లీ ని మేము ప్రజాస్వామికంగా నడుపుతున్నాం. సభలో విపక్ష సభ్యులకే ఎక్కువ టైమ్ ఇచ్చినం. చాలా టైం ఇచ్చినా... అవకాశం ఇవ్వలేదని అంటున్నారు. అసెంబ్లీ లో ఇంత సుదీర్ఘ చర్చలు ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నడూ జరగలేదు. ఒక్కో రోజు 17 గంటల పాటు సభ జరిగింది. బీఆర్ ఎస్ లీడర్లు కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి ముగ్గురే 6 గంటల సేపు మాట్లాడారు. నేను, మా డిప్యూటీ సీఎం భట్టి, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు.. ముగ్గురం కలిసి అంతసేపు మాట్లాడలేదు. నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, తెలంగాణలోనూ ఎమ్మెల్యే గా ఉన్నాను. కానీ ఇప్పుడు జరిగిన అసెంబ్లీ సమావేశాలు పూర్తి ప్రజాస్వామికంగా, బాధ్యతగా జరిగాయి. చర్చను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినా మేము బాధ్యతగా వ్యవహరించాం. ఈసారి బడ్జెట్ సమావేశాలు తక్కువ రోజులేం జరగలేదు. బడ్జెట్ పైనా, పద్దుల పైనా, ద్రవ్య వినిమయ బిల్లుపైనా అందరికీ మాట్లాడే అవకాశం దొరికింది. వీలైనంత చర్చ జరిగింది.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో రాష్ట్రానికి ఉండే కేటాయింపులకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ ఉంటుంది. కేంద్రం జులై 23న బడ్జెట్ ప్రవేశపెట్టింది. అందుకే 25న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి వచ్చింది. జులై 31లోపు ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందటం తప్పనిసరి. అందుకే తక్కువ రోజులు అనిపించింది. కానీ ఒక్కో రోజు 17 గంటలు సభ జరిగింది. సభలో బహిష్కరణలు, సస్పెన్షన్లు, మార్షల్స్ అవసరం రావద్దని మా ఆలోచన. అలాంటి అవసరం సందర్భం వస్తే స్పీకర్ నిర్ణయం తీసుకుంటారు. అవసరాన్ని బట్టి ఎమ్మెల్యే ల సభ్యత్వం కూడా రద్దు కావొచ్చు. గతంలో నన్ను ఒక సెషన్ మొత్తం సస్పెండ్ చేశారు. నా నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరుగుతుందని నేను హైకోర్టులో పిటిషన్ వేశాను. ఏదైనా సమయం, సందర్భాన్ని బట్టి ఉంటుంది.

గద్వాల ఎమ్మెల్యే తిరిగి బీఆర్ ఎస్ లో చేరారని మీడియా అడిగిన ప్రశ్నకు టీ తాగేందుకు కలుసుకోవటం.. రాజకీయాలకు, పార్టీల్లో చేరటానికి సంబంధం లేదన్నారు. ఇటీవల 8, 9 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వచ్చి నాతో కలిసి టీ తాగారు. అంత మాత్రాన మా పార్టీలో చేరినట్టా..? అని ముఖ్యమంత్రి బదులిచ్చారు.


## ఏసీబీకి చిక్కిన కమర్షియల్ టాక్స్ ఆఫీసర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పంజాగుట్ట సర్కిల్–1, హైదరాబాద్ ఉప వాణిజ్య పన్నుల విభాగపు అధికారి శ్రీధర్ రెడ్డి రెండు లక్షల రూపాయల లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఒక ప్రైవేట్ సంస్థకు సంబంధించిన ఆడి ట్ పూర్తి చేయడానికి, తనకు ఇంతకు ముందు అందిన నోటీసును మూసివేయడానికి ఆ సంస్థ యజమాని నుంచి లంచం తీసుకుంటూ శ్రీధర్ రెడ్డి దొరికిపోయాడు. ఈ దాడులకు సంబంధించిన వివరాలను రంగారెడ్డి రేంజ్ ఎసిబి డిఎస్పి ఆనంద్ మీడియాకు వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం ఉప్పల్1కు చెందిన శ్రీకాంత్‌కు సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. ఆయన కంపెనీకి చెందిన ఆస్తులను మూడేళ్లకు గాను లెక్కింపు చేయించేం దుకు పంజాగుట్ట సర్కిల్‌కు చెందిన స్టేట్ టాక్స్ ఆఫీసర్ శ్రీధర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు.అయితే అతను సబ్మిట్ చేసిన ఫార్మాట్ కరెక్ట్‌గా లేదంటూ శ్రీకాంత్‌కు శ్రీధర్ షోకాజ్ నోటీసులు పంపించాడు. ఆ నోటీసుకు గానూ అన్ని డాక్యుమెంట్స్ సరిగ్గానే అందజేశామని శ్రీకాంత్ అధికారికి బదులిచ్చాడు. అయినప్పటికీ లెక్కింపు చేయాలంటే తనకు మూడు లక్షలు లంచం ఇవ్వాలని స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ శ్రీధర్ డిమాండ్ చేశాడు. అంత డబ్బు ఇచ్చుకోలేనని శ్రీకాంత్ తెలుపగా, రూ.2 లక్షలు ఇవ్వడానికి ఒప్పందం చేసుకున్నారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని శ్రీకాంత్ ఎసిబికి సమాచారం ఇచ్చాడు. ఎసిబి వలలో శ్రీధర్ చిక్కాడు. అబిడ్స్‌లోని కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా శ్రీధర్%శ్రీ%ను ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని, అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మహిళలు, చిన్నారుల భద్రతకు రూ.13,412 కోట్లు ఖర్చు..

● కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో మహిళల భద్రత కోసం వివిధ పథకాలు, కార్యక్రమాల కింద కేంద్ర ప్రభుత్వం రూ.13,412కోట్లు ఖర్చు చేస్తోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లోక్ సభలో వెల్లడించారు. మహిళా భద్రతా పథకాల కింద మహిళలు, పిల్లలపై లైంగిక వేధింపుల కేసులను నిర్వహించే పరిశోధకులతోపాటు ప్రాసిక్యూటర్ల సామర్థ్యం పెంపొందించేందుకు శిక్షణ ఇచ్చే నిబంధన ఉందా?, ఏయే కార్యక్రమాలు అమలు చేస్తున్నారంటూ ఎంపీ నీరజ్ శేఖర్ అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ బదులిచ్చారు. ప్రధాని మోడీ ఆదేశాల మేరకు హెూంమంత్రి ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దానికి సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి సభలో వెల్లడించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఇంటర్ ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ కోసం రూ.3,375 కోట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ కోసం రూ.531.24కోట్లు, స్కీం ఫర్ మోడర్నైజేషన్ ఆఫ్ ఫోరెన్సిక్‌కు రూ.280 కోట్లు, జైళ్ల ఆధునీకరణకు రూ.950కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్రాల సైన్స్ ఫోరెన్సిక్ లాబరేటరీల పటిష్టత కోసం రూ.106.75కోట్లు, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలు, ఫోరెన్సిక్ డేటా సెంటర్, 6 సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీల ఆధునికీకరణకు మరో రూ.354.25కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సేఫ్ సిటీ ప్రాజెక్టు కోసం రూ.2,840కోట్లు, మహిళలకు శిక్షణ, సామర్థ్యం పెంపు కోసం రూ.76.5కోట్లు, పేద ఖైదీల కోసం రూ.60కోట్లు, మానవ అక్రమ రవాణా నిరోధక(యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్) యూనిట్ కోసం రూ.113.76కోట్లు, మహిళా హెల్ప్ డెస్కులకు రూ.164.2 కోట్లు, చండీగఢ్‌లో డీఎన్ఏ ల్యాబ్ ఏర్పాటుకు రూ.42.84 కోట్లు, మహిళలు, చిన్నారులపై సైబర్ నేరాల నియంత్రణకు రూ.224.76కోట్లు, సెంట్రల్ విక్టిమ్ కాంపోజిషన్ ఫండ్ కోసం రూ.200కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఢిల్లీ పోలీస్ స్కీమ్ ఫర్ ప్రొవైడింగ్ ఫెసిలిటీ ఆఫ్ సోషల్ వర్కర్స్ , కౌన్సిలర్స్, న్యూ బిల్డింగ్ ఫర్ విమెన్ సెంట్రిక్ ఫెసిలిటీస్, స్పెషల్ నీడ్స్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ కోసం రూ.38.8కోట్లు, నేషనల్ ఫోరెన్సిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ పథకానికి రూ.2254కోట్లు, మొత్తంగా రూ.13,412కోట్లు మన అమ్మలు, అక్కలు, చెల్లెళ్లు, బిడ్డల కోసం కేంద్రం ఖర్చు పెడుతున్నట్లు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వివరించారు

## రాష్ట్రవ్యాప్తంగా 73 మంది సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖలో 73 మంది సబ్ రిజిస్ట్రార్లను ప్రభుత్వం బదిలీ చేసింది. బదిలీ అయినవారిలో గ్రేడ్–1, గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్లు ఉన్నారు. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీచేశారు. మల్టిజోన్ 1లో 25మంది, మల్టిజోన్–2లో 48 మంది సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు.

# క్వార్టర్ ఫైనల్లో లవ్లీనా



**బలగం టీవీ, పారీస్**

ఒలింపిక్స్‌లో రెండో పతకానికి భారత యువ బాక్సర్ లవ్లీనా బోర్గోహెయిన్ ఒక విజయం దూరంలో నిలిచింది. పారిస్ గేమ్స్‌లో లవ్లీనా మహిళల 75 కిలోల విభాగంలో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో లవ్లీనా 50 తేడాతో నార్వేకు చెందిన సునీవాను ఓడించింది. ఆగస్టు 4న జరిగే క్వార్టర్ ఫైనల్లో చైనా బాక్సర్ లి కియాన్‌తో లవ్లీనా తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే లవ్లీనాకు కాస్యం పతకం ఖాయమవుతోంది.

సునీవాతో జరిగిన పోరులో లవ్లీనా పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ ముందుకు సాగింది. కళ్లు చెదిరే పంచ్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. అలవోక విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో లవ్లీనా 69 కిలోల విభాగంలో కాంస్య పతకం గెలిచింది. ఈ ఒలింపిక్స్‌లో కూడా లవ్లీనాకు పతకం సాధించే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి.

మహిళల వ్యక్తిగత ఆర్చరీ విభాగంలో భారత స్టార్ క్రీడాకారిణి దీపిక కుమారి ప్రీక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.ఎస్తోనియా ఆర్చర్ రీనాతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో దీపిక 65 తేడాతో జయకేతనం ఎగుర వేసింది. ఆరంభం నుంచే పోరు ఆసక్తికరంగా సాగింది. ప్రతికూల వాతా వరణంలో విజయం కోసం ఇద్దరు తీవ్రంగా శ్రమించారు. ఇటు దీపిక అటు రీనా కూడా సర్వం ఒడ్డారు. దీంతో మ్యాచ్‌లో ఉత్కంఠ తప్ప లేదు. అయితే తీవ్ర ఒత్తిడిలోనూ దీపిక అద్భుత ఆటను కనబరిచింది. ప్రత్యర్థి సవాల్ దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగింది.ఇదే క్రమంలో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఇక రౌండ్ 32 మ్యాచ్‌లో దీపిక అలవోక విజయం సాధించింది. క్వింటీ రోఫెన్ (నెదర్లాండ్స్)తో జరిగిన పోరులో దీపిక కుమారి 62తో సునాయాస విజయం అందుకుంది. కాగా, షఉటింగ్‌లో భారత్‌కు నిరాశ మిగిలింది. బుధవారం జరిగిన మహిళల ట్రాప్ క్వాలిఫికేషన్ పోటీల్లో భారత షఉటర్లు పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచారు. రాజేశ్వరి కుమారి 22వ, శ్రేయ సింగ్ 23వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈక్వెస్ట్రియన్‌లో అనూష్ అగర్వాల్ కూడా నిరాశే మిగిల్చాడు. వ్యక్తిగత డ్రెసెజ్ గ్రాండ్ ప్రీ విభాగంలో తొమ్మిదో స్థానంలో నిలిచి పోటీల నుంచి ఎలిమినేట్ అయ్యాడు.

# ప్రీ క్వార్టర్స్‌కు పీవీ సింధు

**బలగం టీవీ, పారీస్**

పారిస్ ఒలింపిక్స్‌లో బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ప్రీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. తాజాగా జరిగిన మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు గ్రూప్ స్టేజ్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. ఎస్టోనియాకు చెందిన యంగ్ ప్లేయర్ క్రిస్టిన్ కూబా పై 21-5, 21-10 పాయింట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో సింధు గ్రూప్-ఎం నుంచి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది. అయితే సింధు ఈ మ్యాచ్‌ను కేవలం 34 నిమిషాల్లోనే ముగించడం విశేషం.





## లక్ష్యసేన్ కూడా

మరో మ్యాచ్ లో లక్ష్య సేన్ విజయం సాదించి ప్రీ క్వార్టర్ ఫైనల్స్ కు చేరుకున్నాడు . ఇండోనేషియా క్రీడాకారుడు జోనాథన్ క్రిస్టిపై 21- 18 , 21 - 12 స్కోర్ తో వరుస సెట్ లో ఓడించి ముందంజవేశాడు

## క్వార్టర్స్‌కు హాకీ టీమ్

**బలగం టీవీ, పారీస్**

భారత హాకీ టీమ్ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. బెల్జియంపై ఆస్ట్రేలియా విజయం సాధించడం వల్ల భారత్‌కు క్వార్టర్స్ బెర్తు ఖరారైంది. కాగా, ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు ఇప్పటిదాకా 12 పతకాలు సాధించింది. మరోవైపు అన్ష్ అగర్వాలా ఈక్విస్ట్రియన్ (గుర్రపు స్వారీ)లో నిరాశ పర్చాడు. బుధవారం జరిగిన డ్రెస్సింగ్ ఈవెంట్‌లో అన్ష్ విఫలమయ్యాడు.

# ప్రీ క్వార్టర్స్‌లో దీపికా కుమారి..



**బలగం టీవీ, పారీస్**

పారిస్ ఒలింపిక్స్‌లో భారత ఆర్చర్ దీపికా కుమారి వ్యక్తిగత విభాగంలో 16వ రౌండ్‌కు అర్హత సాధించింది. బుధవారం జరిగిన పోటీల్లో రీనా పర్నాట్(ఎస్తోనియా), క్వింటీ రోఫెన్ (నెదర్లాండ్స్)లను ఓడించిన దీపిక ముందంజ వేసింది. 64వ స్టేజ్ రౌండ్‌లో పర్నాట్‌ను 6-5తో పైచేయి సాధించిన భారత ఆర్చర్ 32వ రౌండ్‌లో రోఫెన్‌పై 6-2తో విజయం సాధించింది. క్వార్టర్స్ బెర్తును నిర్ణయించే తర్వాతి పోరులో దీపిక జర్మనీ ఆర్చర్ మిచెల్లె క్రొప్పెన్ తో తలపడనుంది. వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 13వ స్థానంలో ఉన్న మిచెల్లెకు దీపిక చెక్ పెడితే పతక వేటలో క్వార్టర్స్ లో ప్రవేశిస్తుంది.

**తెలుగమ్మాయి ఆకుల శ్రీజ కూడా..**

.టేబుల్ టెన్నిస్ క్రీడాంశంలో తెలుగమ్మాయి ఆకుల శ్రీజ కూడా ముందంజ వేసింది. టేబుల్ టెన్నిస్ మహిళల సింగిల్స్ విభాగంలో శ్రీజ ప్రీక్వార్టర్స్ చేరింది. ఇవాళ జరిగిన గ్రూప్ మ్యాచ్ లో శ్రీజ 4-2 తేడాతో సింగపూర్ క్రీడాకారిణి జెంగ్ ను ఓడించింది. ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ ఈవెంట్ లో ప్రీక్వార్టర్స్ చేరిన రెండో భారత క్రీడాకారిణిగా ఆకుల శ్రీజ ఘనత సాధించింది



# చరిత్ర సృష్టించిన నొవాక్ జకోవిచ్



**బలగం టీవీ, పారీస్**

నొవాక్ జకోవిచ్ ఒలింపిక్స్‌లో చరిత్ర సృష్టించాడు. విశ్వ క్రీడల్లో నాలుగు పర్యాయాలు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లిన తొలి ఆటగాడిగా జకో రికార్డు నెలకొల్పాడు. పారిస్ ఒలింపిక్స్ రెండో రౌండ్‌లో రఫెల్ నాదల్‌ను ఓడించిన జకోవిచ్.. మూడో రౌండ్‌లో డొమ్నిక్ కోఫెర్‌ను చిత్తు చేశాడు.దాంతో, రికార్డు స్థాయిలో నాలుగోసారి జకోవిచ్ ఒలింపిక్స్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. సెమీస్ బెర్తు కోసం అతడు గ్రీస్‌కు చెందిన సిట్సిపాస్‌తో తలపడనున్నాడు. ఈ సెర్బియా స్టార్ మూడో రౌండ్‌లో రెచ్చిపోయాడు. జర్మనీ కెరటం డోమ్నిక్‌పై 7-5, 6-3తో గెలుపొంది క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. మొత్తంగా ఒలింపిక్స్‌లో అతడికిది 16వ విజయం.

2008 బీజింగ్ విశ్వ క్రీడల్లో కాంస్యంతో సరిపెట్టుకున్న జకోవిచ్ ఆ తర్వాత వరుసగా విఫలమయ్యాడు. అయితే.. నిరుడు నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో రికార్డు సాధించిన జకో ఈసారి గోల్డ్ మెడల్ లక్ష్యంగా పెట్రేగిపోతున్నాడు. మరోవైపు ఇటలీ సంచలనం లొరెంజో ముసెట్టి సైతం నాకౌట్‌కు అర్హత సాధించాడు. అమెరికాకు చెందిన టేలర్ ఫ్రిట్జ్‌పై అద్భుత విజయంతో లొరెంజో ఒలింపిక్స్ క్వార్టర్స్ బెర్తు సాధించాడు.





# ఉరుకు పటేలా టీజర్ విడుదల


**బలగం టీవీ, పారీస్**

టాలీవుడ్ యువ కథానాయకుడు తేజస్ కంచర్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. గెట్ ఉరికిఫైడ్ అనేది ఉప శీర్షిక. ఈ సినిమాకు వివేక్‌రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా.. కంచర్ల బాలభాను నిర్మిస్తున్నాడు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఇక ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే ఫస్ట్ లుక్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా టీజర్‌ను వదిలింది.ఈ టీజర్ చూస్తే.. గ్రామీణ నేపథ్యంలో సాగే భావోద్వేగ ప్రయాణమని తెలుస్తుంది. ఈ సినిమాలో ఖుష్బూ చౌదరి హీరోయిన్‌గా నటిస్తుంది. ఫన్నీగా సాగిన ఈ టీజర్ మీరు చూసేయండి. ఈ చిత్రానికి కెమెరా: సన్నీ కూరపాటి, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, నిర్మాణం: లీడ్ ఎడ్జ్ పిక్చర్స్.

**రామ్ పోతినేని టైటిల్ రోల్‌లో నటిస్తోన్న సీక్వెల్ ప్రాజెక్ట్ డబుల్ ఇస్మార్ట్ . పూరీజగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. డబుల్ ఇస్మార్ట్ ఆగస్టు**



**15న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదలవుతుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌పై ఫోకస్ పెట్టింది రామ్ టీం. ఇప్పటికే రామ్‌తోపాటు కీ రోల్ చేస్తున్న సంజయ్ దత్ డబ్బింగ్ పూర్తి చేసినట్టు తెలియజేశారు మేకర్స్. డబుల్ ఇస్మార్ట్ ట్రైలర్‌ను ఆగస్టు 4న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. మామా.. శంకర్ గాడి మెంటల్ మాస్ కీ రెడీ అయిపోండి.. అంటూ రిలీజ్ చేసిన ట్రైలర్ అప్‌డేట్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది.**




**టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ సినీ ప్రయాణం ప్రారంభించి ఈ నెల 30తో 50 ఏండ్లు పూర్తి చేసుకోనున్నారు. ఈ సందర్భంగా తెలుగు చిత్ర పరిశ్రమ ఆయనను సెప్టెంబరు 1న ఘనంగా సన్మానించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అలానే ఈ ప్రతిష్టాత్మక 50 వసంతాల బాలయ్య సినీ స్వర్ణోత్సవ సంబరాలను భారీ స్థాయిలో నిర్వహించబోతున్నట్టు ఎన్‌బీకే ఫ్యాన్స్ కూడా తెలిపారు. బాలయ్య అభిమానులంతా ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి అత్యంత వైభవంగా 50 రోజుల పాటు పెద్దఎత్తున నిర్వహించనున్నారు. అయితే త్షాజాగా చిత్రసీమ నిర్వహించనున్న బాలయ్య సినీ స్వర్ణోత్సవ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రిక ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వేడుకను సెప్టెంబర్ 1న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్?లో నిర్వహించబోతున్నట్లు అందులో రాసి ఉంది.**